క్లుప్తంగా

నేడు మద్యం, మాంసం విక్రయాలు బంద్

నాదెండ్ల: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మాంసం, చేపలు, మద్యం విక్రయాలు చేయరాదని నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారం పూర్తిగా విక్రయాలు నిలిపి వేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం తప్పవన్నారు. గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వ్యాపారులకు నోటీసులు జారీ చేయటమే కాక దండోరా వేయించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారి డాక్టరు హనుమ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హనుమకుమార్ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది రోగుల పట్ల ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాన్నారు. ల్యాబ్‌లో అందుతున్న వైద్య పరీక్షల, క్యాన్సర్ పరీక్షలు సక్రమంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



శావల్యాపురం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. శనివారం మండలంలోని పిచికలపాలెం, శావల్యాపురం గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి 350 క్వింటాల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దళారుల నుంచి రైతుల మోసపోకుండా ఉండటానికి ప్రభుత్వ మద్దతూ 76 కేజీల బస్తా ధర రూ.1740 రూపాయలకు తేమ శాతం నాణ్యత ప్రమాణాలు ఆధారంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, మిల్లర్ అనిల్, వీఏఏ వెంకాయమ్మ రైతులు పాల్గొన్నారు.

నేటి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహన ర్యాలీని జయప్రదం చేయాలి

రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు

నరసరావుపేట: కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో నిర్వహించే ట్రాక్టర్, మోటార్ సైకిల్ ర్యాలీలో అఖిల పక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. శనివారం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో గోపాలరావు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్పులు చేసి కార్మికుల హక్కులు కాలరాస్తుందని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు. స్థానిక వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం నుంచి స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కు వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు.

వైఎస్సార్ దిమ్మె తొలగించడం హేయమైన చర్య

శావల్యాపురం: పచ్చని గ్రామాల్లో టీడీపీ నాయకులు గొడవలు సృష్టించే విధంగా చేయటం హేయమైన చర్య అని మండల వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ, మాజీ ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు శనివారం మండిపడ్డారు. మండలంలోని కారుమంచి గ్రామం ప్రధాన కూడలి మార్గంలో సిమెంటు రోడ్డు పనులు చేస్తున్న క్రమంలో అడ్డుగా ఉందని సాకుతో వైఎస్సార్ దిమ్మెను మాత్రమే టీడీపీ నాయకులు తొలగించటాన్ని తప్పు పట్టారు.

సభలను జయప్రదం చేయండి

నరసరావుపేట: నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయకుమార్ కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. . ఫిబ్రవరి మూడవ తేదీ బహిరంగ సభ జరుగుతోందని ఈ బహిరంగ సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సత్తా చూపారు.. బహుమతులు గెలుచుకున్నారు!



క్విజ్‌పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం పొందిన లక్ష్మీపూర్ణిమకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



కలెక్టరు పి.అరుణ్‌బాబు చేతులమీదగా ప్రశంసా పత్రం అందుకుంటున్న వేల్పూరు విద్యార్థిని

నాదెండ్ల: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన వివిధ పోటీల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 'నథింగ్ లైక్ ఓటింగ్ – ఐ ఓట్ ఫర్ షూర్' అనే అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో టి జగన్మోహన్‌రెడ్డి, కె.హిమ ఆదిత్య, వక్తృత్వం పోటీల్లో ఎం.లక్ష్మీపూర్ణిమ ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

శావల్యాపురం: 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా కలెక్టరు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలను నరసరావుపేట పట్టణం భువనచంద్ర టౌన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లఘు నాటిక విభాగంలో ప్రథమ బహుమతి, పాటల పోటీల్లో రెండవ బహుమతి సాధించగా జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు, ఆర్డీవో కె.మధులత చేతుల మీదగా బహుమతులు అందుకున్నట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు తెలిపారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి అందరు ఓటు వేయాలి అనే లఘు నాటికను విద్యార్థులు సాయికృష్ణ, వివేకనంద, ధనుష్,కైలాస్, అశోక్, అజయ్, సంజయ్, శ్రీహేమలతలు ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో 14 టీమ్స్ పాల్గొనగా, వేల్పూరు విద్యార్థులు మంచి ప్రతిభ చూపేలా గైడు టీచరు జె.శ్రీనివాసరావు వ్యవరించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

విద్యార్థి దశ నుంచే ఓటుపై అవగాహన ఉండాలి

శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్



ఓటరు ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నరసరావుపేట ఈస్ట్: ప్రజాస్వామ్య విలువలను చాటే ఓటు పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. పట్టణంలోని వివిధ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఓటుహక్కు అంశంపై పోటీలను నిర్వహించి బహుమతులు అందచేశారు. ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, ఈఏడాది ఓటరు దినోత్సవాన్ని ఓటుకు మించినది లేదు, ఓటు వేస్తాం నినాదంతో జరుపుకుంటున్నామని వివరించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువత తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. దీనిలో భాగంగానే ఓటుపై విస్తృత ప్రచారం కల్పించేందుకు ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఎం.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఐ.సదాశివ రెడ్డి, చరిత్ర విభాగాధిపతి పి.రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు టి.వి.శంకరరెడ్డి, డాక్టర్ ఎ.సరళాదేవి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఎస్‌పిఎల్ ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలపై అవగాహన కల్గించేలా పోలింగ్‌బూత్‌లు ర్పాటు చేసి విద్యార్థులు బ్యాలెట్‌పేపర్లను బూత్‌లలో వేసి ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని, గ్రామపంచాయతీ ఎన్నికల దగ్గరి నుంచి, పార్లమెంట్ ఎన్నికల వరకూ జరిగే ఎన్నికల ప్రక్రియ, నియమావళిని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని పి.హెవేలా, ఉపాధ్యాయులు జ్యోతి,గోవిందనాయక్, మహేంద్ర, పద్మావతిలతోపాటు పలువురు పాల్గొన్నారు.



పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు

ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలి

నరసరావుపేట రూరల్: ఓటు హక్కును ప్రతి ఒక్కరు తప్పని సరిగ్గా వినియోగించుకోవాలని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1950 జనవరి 25వ తేదీన రాజ్యాంగబద్ధ సంస్థ ఎన్నికల కమిషన్ ఏర్పడిందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే రోజున ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ఎనలేని

పదవీ విరమణ చేసిన హోంగార్డును సన్మానించిన ఎస్పీ



నరసరావుపేట: పోలీసు విభాగానికి హోంగార్డులు అందజేసే సేవలు ఎనలేనివని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. బండ్లమోటు పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎ.నరసయ్యకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూలదండలు వేసి శాలువ కప్పి ఘనముగా సన్మానం చేసి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వారి భావి జీవితం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, హృదయపూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలియచేశారు. హోంగార్డు ఆర్.ఐ కృష్ణ, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయసేవా సదస్సు

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ఇనిమెళ్ళ గ్రామంలో న్యాయ సేవా సదస్సు మెడికల్ శిబిరం నిర్వహించారు. వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి పాల్గొని మాట్లాడుతూ చట్టాలపై ప్రజలు అవగాహన కల్గియుండాలన్నారు. వైద్యం అనేది ప్రతి ఒక్కరు ప్రాథమిక హక్కు అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని అలా పరీక్షలు చేయించుకున్న భార్యభర్తలు వైద్యాధికారి కూడా శిక్షకు పాత్రులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఈపూరు ఎస్సై యం.ఉమామహేశ్వరరావు, వైద్యాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెదకూరపాడు తహసీల్దార్‌గా నీలి ధనలక్ష్మి

నాదెండ్ల: పెదకూరపాడు తహశీల్దార్‌గా నీలి ధనలక్ష్మి పోస్టింగ్ పొందారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి శనివారం ఆమెకు ఉత్తర్వులు అందాయి. నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ధనలక్ష్మీ 2019లో గ్రూప్2 ద్వారా డీటీగా పిడుగురాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 2023 అక్టోబర్‌లో బదిలీపై నాదెండ్ల కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ పదోన్నతి పొందారు.

ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా తహసీల్దారు సురేష్

వినుకొండ(నూజెండ్ల): 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా తరుపున అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఉత్తమ అధికారిగా వినుకొండ తహసీల్దారు సబవత్ సురేష్ నియామకమయ్యారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యదర్శి కె.విజయానందన్ చేతుల మీదగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే బొల్లా
- సబ్‌జైలులో కార్యకర్తల పరామర్శ
- అక్రమ కేసుల నమోదు మానుకోవాలి



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): అమాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదుచేసి జైలుకు పంపడం ఎక్కడా చూడలేదని మాజీఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. శనివారం వినుకొండకు వచ్చిన ఆయన పల్నాడుజిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాతో కలసి ఇటీవల పోలీసులు జైలు సబ్‌జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం మీడియాతో బొల్లా మాట్లాడుతూ పోలీసులు ఇష్టానుసారంగా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో రషీద్‌ను నడిబజారులో కిరాతకంగా హత్యచేస్తే రషీద్ అన్న అయిన ఖాదర్‌భాషా ఫిర్యాదు చేస్తే ఆ కేసులో నిందితులుగా ఉన్న వారిని పట్టుకోకుండా, హత్యకేసులో నిందితులొచ్చి ఫిర్యాదుతో రషీద్ అన్నపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం పోలీసుల పరితీరుకు అద్దం పడుతుందన్నారు. 30 కుటుంబాల ముస్లిం కుటుంబాలను టార్గెట్‌చేసి కేసులు నమోదు చేయడందారుణమన్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమిప్రభుత్వం కక్షపూరితంగా కేసులు నమోదు చేస్తున్నారని ఇది మంచి సంస్కృతి కాదన్నారు. అన్యాయంగా పోలీసులు కేసులు నమోదు చేయడం ఖండిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు అండగా ఉంటామని హామీఇచ్చారు. సమావేశంలో ఎంజెఎన్. ప్రసాదు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కొండవీడు ఇఎన్‌టీలో ఉచిత వైద్యశిబిరం

చెవి, ముక్కు, గొంతు సమస్యలకు ఉచిత వైద్యం, మందులు అందజేత



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్లు, సిబ్బంది

నరసరావుపేట: గుంటూరురోడ్డులోని డాక్టర్ కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్లో ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం చెవి, ముక్కు, గొంతు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎన్ఏబీహెచ్, ఐఎస్‌వో సంస్థల గుర్తింపు పొందిన తమ హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేయబడతాయని, ప్రతి డిజిటల్ ప్రోగ్రామబుల్ చెవిటి మిషన్‌పై 30 శాతం రాయితీతో అందజేస్తామన్నారు. అలాగే తల తిరుగుడు (వర్టిగో) పరీక్షపై 20 శాతం రాయితీ ఉంటుందన్నారు. ముఖపక్షవాతం, గురక, చెవిలో శబ్దాలు, ముక్కు బిగవేయటం, ముక్కులో కాయలు, ఆహారం మింగుడు పడకపోవటం, గొంతు క్యాన్సర్, తలనొప్పి, చెవినొప్పి, చీము కారటం, గొంతు నొప్పి, థైరాయిడ్ కణతులు, కింటి నుంచి నీరు, ముక్కు నుంచి రక్తం, కళ్లు తిరగటం లాంటి సమస్యలు ఏమి ఉన్నా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, మందులు అందజేయబడతాయన్నారు. కావున ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో డాక్టర్ కె.వర్షిణి, సిబ్బంది పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో మెరిసిన సొలస విద్యార్థులు



విజయసంకేతాన్ని చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యడ్లపాడు: రంగోత్సవ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ జాతీయ స్థాయి పోటీల్లో కొత్తసొలస ఏపీ పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. బొంబాయికి చెందిన స్వచ్ఛంద సంస్థ రంగోత్సవ్ ఏటా క్రమం తప్పకుండా అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగాల్లో పలు పోటీలను నిర్వహిస్తుంది. 2024–25 సంవత్సరానికి గతేడాది నవంబర్‌లో జాతీయస్థాయి పోటీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించింది. ఈ పోటీల్లో సొలస పాఠశాలకు చెందిన 19 మందికి వివిధ విభాగాల్లో పలు మెడల్స్‌ను సాధించారు. కలరింగ్, స్కెచ్చింగ్, హ్యాండ్‌రైటింగ్, టాటు మోడల్స్, గ్రీటింగ్ కార్డుల తయారీ, క్యారీకేచర్, ఫింగర్ అండ్‌థంబ్ పెయింటింగ్, డ్రాయింగ్ వంటి 9 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో పాఠశాల విద్యార్థులకు గోల్డ్‌మెడల్–8, సిల్వర్ మెడల్స్ –5, బ్రాంజ్ మెడల్స్ –4, మెరిట్ అవార్డ్ ట్రోఫీ–1, యూకేజీ విద్యార్థినికి సర్‌ప్రైజ్ గిఫ్ట్–1తో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం షేక్ ఝున్నుసాహెబ్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థుల్ని అన్ని రంగాల్లో ప్రవేశం కల్పించాలనే ఉద్దేశంతో అన్ని పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరికి గణతంత్ర దినోత్సవం నాడు గ్రామపెద్దల సమక్షంలో అభినందన సభను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏఎంరెడ్డి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి పోటీలకు ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. కళాశాల డిప్లొమా విద్యార్థులు కె.హరికృష్ణ, ఎం.శ్రీనివాస్, ఎం.హర్షకుమార్, ఎస్.అనురాగ్‌లు గత నెలలో గుంటూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. అథ్లెటిక్స్‌లో 400 మీటర్లు, 1500 మీటర్ల పరుగు విభాగంలో బహుమతులు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. వైజాగ్‌లో ఈనెల 28 నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. పరుగు పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ.కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎనిమిదేళ్లయినా ఆరంభానికి నోచుకోని విగ్రహాలు!!



నూజెండ్లలో ప్రారంభానికి నోచుకోని విగ్రహాలు

నూజెండ్లలో జాతిపిత మహాత్మాగాంధీ, రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి మహనీయుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలు ఎనిమిదేళ్లగా ఆరంభించే వారు కానరాక దీనంగా నిరీక్షిస్తున్నాయి. విగ్రహాలన్నీ గాలి–ధూళి–వానలకు ఆవాసమైపోతున్నాయి. అసలు వీటిని ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా 8 సంవత్సరాల క్రితం కొంత మంది ఔత్సాహికులు ఎన్నెస్పీ ఖాళీ స్థలంలో విగ్రహాలను ఏర్పాటు చేశారు. నేటి వరకు విగ్రహ ఆవిష్కరణ జరగపోవటం శోచనీయం. విగ్రహాల ముందు శిలాఫలకం మాత్రం ఏర్పాటు చేశారు. కానీ ఆరంభించిన నాథుడే లేడు ఇవాల్టికి. ఎన్నో గాంధీ జయంతులు, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాలు వచ్చి వెళ్లిపోతున్నా వీటిని పట్టించుకున్న నాయకుడు కరువయ్యాడు. కనీసం ఆ మహనీయుల ను స్మరించుకుంటూ ఒక్క పూలదండ కూడా వేసిన దాఖలాలు లేవు. విగ్రహాలు ఎవరు ఏర్పాటు చేసినా జాతినేతలు పట్ల ఇటువంటి నిర్లక్ష్యం తగునా అని మండల ప్రజల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

–వినుకొండ (నూజెండ్ల)

డైనింగ్ హాల్, వాటర్ షెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవం



మనోహర్ దంపతులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో దాతలు ఇచ్చిన రూ.7 లక్షల రూపాయలతో నిర్మించిన డైనింగ్ హాల్, వాటర్ షెడ్‌ను వి–టెక్ ప్రైవేట్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్ అర్వపల్లి మనోహర్ శనివారం ప్రారంభించారు. అర్వపల్లి మనోహర్ తన సొంత నిధులతో డైనింగ్ హాల్ నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం బియం. సుభాని మాట్లాడుతూ అడగగానే రూ.7 లక్షల రూపాయలు వెచ్చించి డైనింగ్ హాల్ నిర్మించిన మనోహర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. రూ.50 వేల రూపాయల విలువ చేసే ఆట వస్తువులను మనోహర్ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ కమిటీ చైర్మన్ యిట్టి ఏడుకొండలు, పడాల చక్రారెడ్డి, మొండితోక రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు నెల్లూరి శ్రీనివాసరావు, పల్లెల అంజిరెడ్డి, కల్లి మల్లారెడ్డి, పెద్దినీడి సుబ్బారావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, వి.టెక్ కంపెనీ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు గొప్పది

నాదెండ్ల: ఓటు హక్కు అత్యంత గొప్పదని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్ ఏవీ రమణ చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. మండలంలోని ప్రతి పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, సచివాలయాల్లో నిర్వహించారు. గణపవరం సీఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, చుండి రంగనాయకులు పాల్గొన్నారు.

నేడు మాంసాహార దుకాణాల కార్యకలాపాలు నిషేధం

నరసరావుపేట: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో మాంసాహార దుకాణాల కార్యకలాపాలను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జంతు వధశాలలు, చికెన్, మటన్, చేపల హోల్‌సేల్ అండ్ రిటైల్ వ్యాపారులు, హోటలళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు క్రయ విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని కోరారు. దీనికి భిన్నంగా ఎవరు వ్యవహరించినా చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సందెపూడి, గణేశునివారిపాలెంలో పశువైద్యశిబిరాలు

యడ్లపాడు: మండలంలోని జగ్గాపురం పశువైద్యశాల పరిధిలో సందెపూడి, గణేశునివారిపాలెం గ్రామాల్లో శనివారం పశువైద్య ఆరోగ్య కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. పశువైద్యురాలు పి.కిరణ్మయి శిబిరంలో పాల్గొని ప్రభుత్వం పశుపోషకులకు అందిస్తున్న పథకాలను, అలాగే ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 126 దూడలకు నట్టల నివారణ మందులు , 26 పశువులకు గర్భకోశ వ్యాధికోశ వ్యాధులకు చికిత్సలు, 21 పశువులకు చూడు పరీక్షలు, 19 సాధారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సాయి గోపీకృష్ణ, లిఖిత, తుర్లపాడు గ్రామ గోపాలమిత్ర వరప్రసాద్, సిబ్బంది చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు యూపీ స్కూల్ విద్యార్థులు క్విజ్‌పోటీల్లో సత్తా

యడ్లపాడు: రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో మండలంలోని కొండవీడు గ్రామానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన విజయవాడ పోరంకి మురళీకృష్ణ రిసార్ట్స్‌లో నిర్వహించి రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో కొండవీడు పీఎంశ్రీ మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభాపాటవాలను చాటారు. వివిధ జిల్లాలకు చెందిన జట్లతో తలపడి పోటీల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుని విజేతలుగా నిలిచారు. శనివారం పాఠశాలలో విజేతలకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులు కె.జ్యోత్స్న, ఎల్.స్వాతి, 7వ తరగతి విద్యార్థి ఎంఎస్‌వీఅలి చరణ్‌జట్టురాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో గెలుపొందడం అభినందనీయమన్నారు.